సాక్షి
మెదక్
శనివారం । 18 । నవంబర్ । 2023



సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి

కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి తెలిపారు. వివరాలు 10లో▸



సీఎం మాటలను నమ్మరు

సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలను నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు నమ్మరని కాంగ్రెస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. వివరాలు 10లో▸



బీఆర్‌ఎస్‌తోనే గిరిజనుల..

బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గిరిజనులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా అన్నారు. వివరాలు 11లో▸

న్యూస్‌రీల్

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎన్నికల అబ్జర్వర్ సంజయ్‌కుమార్



ఓటర్లతో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

శివ్వంపేట(నర్సాపూర్): ఓటర్లు నిర్భయంగా వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుని ఆయన పరిశీలించారు. అనంతరం దొంతి, గుండ్లపల్లి గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రజలు, యువకులతో మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, మద్యం, డబ్బుల పంపిణీపై ప్రజలు సీవిజల్, 1950 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఓటర్లలందరూ ప్రలోభాలకు లొంగకుండా అమూల్యమైన ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా లైజర్ అధికారి కృష్ణమూర్తి, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సిబ్బంది వెంకట సుబ్బయ్య, ఎస్‌ఐ రవికాంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్లు కల్గిన యువకుడిపై కేసు నమోదు

సీఎం కేసీఆర్ సభలో హల్‌చల్

నర్సాపూర్ : నర్సాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభలో బుల్లెట్లు కల్గి కలకలం రేపిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయికోడ్‌కు చెందిన అస్లాం చిలిపిచెడ్ మండలంలోని చండూర్‌లో తన మేనమామ వద్ద ఉంటూ చికెన్ దుకాణంలో పని చేస్తున్నాడు. 2015లో ఎన్‌సీసీలో చేరి ఫైరింగ్ శిక్షణ పొందాడని అదే సమయంలో అతడికి రెండు బుల్లెట్లు దొరుకగా వాటిని తీసుకొని భద్రపరుచుకున్నాడని పేర్కొన్నారు. సీఎం సభ సమయంలో సభా ప్రాంగణంలోని ప్రెస్ గ్యాలరీలో అస్లాం కనిపించడంతో అక్కడ మఫ్టీలో ఉన్న పోలీసులకు అనుమానం వచ్చింది. నీవు ప్రెస్ రిపోర్టర్‌వి కాదు కదా ప్రెస్‌గ్యాలరీలోకి ఎలా వచ్చావని ప్రశ్నించారు. అతను తన వద్ద ప్రెస్ గుర్తింపు కార్డు ఉందని చెప్పి పర్సులో ఉన్న ఐడీ కార్డు తీసే క్రమంలో రెండు బుల్లెట్లు కిందపడ్డాయి. వెంటనే అతడిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అతను ఎన్‌సీసీ శిక్షణ పొందిన సెంటర్‌కు వెళ్లి విచారించగా అతను క్యాడెట్ అని తేలినప్పటికీ బులెట్లు కల్గి ఉన్నందున కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్‌ఐ తెలిపారు.

సంక్షేమ ఫలాలే పార్టీని గెలిపిస్తాయి

అసైన్డ్ భూ సమితి జిల్లా అధ్యక్షుడు నందు




అవగాహన కల్పిస్తున్న నందు

నిజాంపేట(మెదక్): సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయని అసైన్డ్ భూ సమితి జిల్లా అధ్యక్షుడు నందు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపడుతున్నటువంటి సంక్షేమ పథకాలే పార్టీ గెలుపునకు కృషి చేస్తాయని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకే ఎక్కువగా అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ అసైన్డ్ భూములకు కూడా పట్టాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల్లో మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని మంత్రి హోదాలో చూస్తామని ధీమా వ్యక్తం చేశారు.

20న ప్రియాంక గాంధీ రాక

హుస్నాబాద్‌లో భారీ బహిరంగ సభ



హుస్నాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 20న హుస్నాబాద్‌కు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ రానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఏసీపీ సతీష్, సీఐ కిరణ్‌లు అడిగి తెలుసుకున్నారు.

అడుగడుగునా నిఘా

- జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు
- ఇప్పటివరకు రూ.1.58 కోట్లు సీజ్
- నగదు తరలిస్తున్న 63 మందిపై కేసులు
- రూ.98 లక్షల విలువైన మద్యం స్వాధీనం
- 23.38 క్వింటాళ్ల బియ్యం సీజ్



నిజాంపేటలో తనిఖీ చేస్తున్న పోలీసులు



చిన్నశంకరంపేటలో జెడ్పీచైర్‌పర్సన్ హేమలత వాహనం తనిఖీ చేస్తున్న అధికారులు

మెదక్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు జిల్లాలో అడుగడుగునా నిఘా పెట్టారు. ఇందులో ఎన్నికల వ్యయ పరిశీలకులు, పోలీసు, ఎక్సైజ్, ఐటీ, ఇతర కేంద్ర నిఘా సంస్థలు అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలపై దృష్టి సారించారు. అలాగే, అక్రమ మద్యం తరలించకుండా చర్యలు చేపట్టారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి పత్రాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గానికి ఒక వ్యయ పరిశీలకుడిని నియమించింది.

రూ. 1.58 కోట్లు స్వాధీనం..

ఎన్నికల కోడ్ ఈనెల 9వ తేదీ నుంచి అమల్లోకి రాగా జిల్లా వ్యాప్తంగా సరిహద్దుల్లో పోలీసులు 7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో నగదుకు సంబంధించి 63 కేసుల్లో రూ. 1,58,34,440 స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి తరలించారు. అంతే కాకుండా రూ. 98, 37,640 విలువ చేసే మద్యం, 23.28 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేస్తున్నారు. అలాగే, సుమారు రూ.30,375 విలువ చేసే 1.25 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 53 కేసులకు సంబంధించి లెక్కలను బాధితులు చూపించడంతో రూ. 1,38,92,990 నగదుకు గ్రీవెన్స్ కమిటీ అధికారులు విడుదల చేశారు. ఇంకా 10 కేసులు పెండింగ్‌లో ఉండగా వాటికి సంబంధించి రూ. 19,41,450 నగదు ఉంది. ఇందులో 2 కేసులను మాత్రం ఐటీశాఖకు అప్పగించారు. ఐటీశాఖకు అప్పగించిన దీంట్లో వెల్దుర్తి మండల కేంద్రంలో ఓ వ్యక్తి భూమికొనుగోలు చేసి సదరు వ్యక్తికి చెల్లించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రూ.12 లక్షలు తీసుకొస్తుండగా పట్టుబడ్డాడు.

నగదు తరలిస్తే కేసులు..

జిల్లాలో రూ.50 వేలకు మించి నగదు తరలించే వారిపై ఎన్నికల సంఘం పక్కా నిఘా పెట్టింది. అక్రమంగా తరలించే డబ్బు, మద్యంతోపాటు ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలు పెట్టే ఇతర వస్తువులను పట్టుకుంటున్నారు. నిఘా కోసం జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ఉన్నతాధికారులు జీపీఎస్ ట్రాక్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడూ ఆయా బృందాల పనితీరును సమీక్షిస్తున్నారు. జిల్లా గ్రీవెన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, సాయిలు, రాకేష్‌లుగా వ్యవహరిస్తున్నారు.

అభ్యర్థులు, నాయకులపై నిఘా

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తుంటారు. ఇందుకు కావాల్సిన నగదు, మద్యం, గిఫ్టులు వంటివి ఇస్తుంటారు. అభ్యర్థుల ప్రచారాలను, కదలికలను పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వీరు అభ్యర్థులపై ఎప్పటికప్పుడూ నిఘా ఉంచుతారు. వారు ఎక్కడి వెళ్తున్నారు.. ఎవరిని కలుస్తున్నారు.. నిరంతరం నిఘా ఉంచుతారు. వారి వాహనాలను కూడా కుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేఅభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయొద్దని ఎన్నికల సంఘం నిబంధన పెట్టిన విషయం తెలిసిందే.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎన్నికల పరిశీలకుడు పృథ్వీరాజ్ , అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

యువతతో పోలింగ్ బృందాలు

- కలెక్టర్ రాజర్షిషా
- రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియపై

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా రెండు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల్లో మహిళా బృందాలను, యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ సమక్షంలో నిర్వహించారు. సాధారణ పరిశీలకులు పృథ్వీరాజ్ ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. జిల్లాలోని రెండు సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 764 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పోలింగ్ విధుల కోసం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మరో 9 శాతం రిజర్వు సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడిన ప్రతీ బృందంలో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారని వివరించారు. జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, ఈడీఎం సందీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళి



డీఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

తూప్రాన్: విధులపై అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులపై నక్సలైట్లు పేల్చిన మందుపాతరకు డీఎస్పీతోపాటు ఐదుగురు సిబ్బంది చనిపోయారు. నవంబరు 17 నాటికి ఈ ఘటన జరిగి 26 ఏళ్లు గడుస్తోంది. శుక్రవారం తూప్రాన్ పట్టణ కేంద్రంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. తూప్రాన్ డివిజన్ పరిధిలోని శివ్వంపేట మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో నక్సలైట్ల ప్రాబల్యం అధికంగా ఉండేది. ఈ క్రమంలోనే 1997 నవంబరు 16న పిల్లుట్ల గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఇంటిని నక్సలైట్లు పేల్చివేశారు. ఘటనా స్థలానికి ఎలాగైనా పోలీసులు వస్తారని భావించిన నక్సలైట్లు వారు వచ్చే దారిలో మందుపాతరలను అమర్చి ప్రణాళికబద్ధంగా పేల్చివేశారు. ఈ ఘటనలో డీఎస్పీ, సీఐ, హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు అసువులు బాసారని తెలిపారు. చనిపోయిన డీఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా డీఎస్పీ విగ్రహానికి పూలమాలలు వేసి పోలీసులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివానందం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు చేర్యాలకు సీఎం కేసీఆర్

- మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా ఆశీర్వాద సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అభ్యర్థి పల్లా



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, అభ్యర్థి పల్లా

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ శనివారం చేర్యాలకు వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాలలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సభ కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వేలాది మంది ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

బహిరంగ సభ వేదికతో పాటు పలు చోట్ల సీఎం ప్రత్యేక నిఘా విభాగం, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. కేసీఆర్ వచ్చే మార్గం మొత్తం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తు కోసం 600 మంది పోలీసులను నియమించారు. నలుగురు అదనపు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 20మంది సీఐలు, 60మంది ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, క్విక్ రెస్పాన్స్ బృందాలు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.

సీపీ పరిశీలన..

ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణాన్ని సీపీ శ్వేత పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, బహిరంగ సభ వేదిక, సభకు వచ్చే మార్గాలతో పాటు వెళ్లే సమయాల్లో తీసుకునే జాగ్రత్తలు, వీఐపీ దారులు, తదితర వాటికి సంబంధించిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. అంతకు ముందు బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉంటే సీఎం సభకు భారీగా ప్రజలను తరలించేందుకు బీఆర్‌ఎస్‌లోని ముఖ్యులకు బాధ్యతలు అప్పగించారు..

ఈటలకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆరే

రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిందే మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: బీజేపీ నేత ఈటలకు రాజకీయ భిక్ష పెట్టింది సీఎం కేసీఆరేనని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల కోసం ఆపద మొక్కులతో ప్రజల్లోకి వస్తున్న నేతలకు బుద్ధి చెప్పాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్‌పై ఈటల పోటీ చేయడం చూస్తుంటే ఆయన నియత్తు లేదనేది అర్థం అవుతోందన్నారు. హుజురాబాద్, గజ్వేల్‌కు పొంతన లేదని, రాష్ట్రంలో బీజేపీకి చోటు లేదన్నారు. ఝూటా మాటలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలన్నారు. రాష్ట్రం ప్రభుత్వం పింఛన్ పెంపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 5.35లక్షల మంది దివ్యాంగులకు మేలు చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో మరింత జోష్

బీజేపీ, కాంగ్రెస్ నుంచి పలువురు చేరిక



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్ : నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆ రెండు పార్టీలకు గండి పడుతుండగా బీఆర్‌ఎస్ బలపడుతుంది. ఈనెల 16న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ముఖ్య నాయకులు సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరడంతో తమ పార్టీ మరింత బలపడిందని ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనీల్ కుమార్, కౌడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి సురేశ్ నాయక్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు అజ్మత్‌లతోపాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో సీఎం సమక్షంలో చేరిన విషయం తెలిసిందే. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, నర్సాపూర్‌కు చెందిన కౌన్సిలర్ సునీతా బాల్‌రెడ్డి ఆశీర్వాద సభలో సీఎం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇదిలా ఉండగా బీజేపీ శివ్వంపేట మండల శాఖ అధ్యక్షుడు రవిగౌడ్, హత్నూర మండల శాఖ కార్యదర్శి నవీన్, నర్సాపూర్ యువ మోర్చా అధ్యక్షుడు అనీల్, ఇతర నాయకులు లడ్డు, హరిగౌడ్ తదితరులు బీజేపీకి రాజీనామా చేసి సీఎం ఆశీర్వాద సభ అనంతరం హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు ఇంటికి వెళ్లి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తమ తమ పార్టీల నుంచి నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినందున, ఆయా పార్టీల నాయకులు తమకు కలిగే నష్టాలను అంచనా వేస్తున్నారు. ఇతర నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీ నాయకులు చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది.

రోహిత్ మాటలకు అర్థాలే వేరులే..!

ప్రచారంలో వింత వ్యాఖ్యలు

- గెలిస్తే రోజుకు 48 గంటల కరెంట్
- నవ్వుకుంటున్న జనం
- మెదక్ నియోజకవర్గంపై అవగాహన కరువు!
- పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్న వైనం



ప్రచారంలో మాట్లాడుతున్న రోహిత్‌రావు

మెదక్: కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావు మాటలకు అర్థాలే వేరులే.. అనే విధంగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. తాను గెలిస్తే రోజుకు 48 గంటల కరెంటు ఇస్తాననడంతో ఇదేం చోద్యం రోజుకు 24 గంటలే కదా ఉన్నది.. అని ప్రజలు నవ్వుకుంటున్నారు. అలాగే, మెదక్ నియోజకవర్గంపై కనీస అవగాహన కూడా లేకుండా ఆయన మాట్లాడుతుండడంతో సొంత పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు. గడిచిన పదేళ్లలో జరిగిన అభివృద్ధి, తక్షణం నియోజకవర్గ ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకొని ప్రచారం చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ, రోహిత్‌రావు ఇష్టానుసారంగా మాట్లాడడం ఏమిటని పలువురు వాపోతున్నారు. ప్రచారంలోనూ ప్రజలపై మండిపడుతూ నేను చెప్పిందే వినాలని అనే విధంగా అసహనం వ్యక్తం చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రేపు ఎమ్మెల్యేగా ఎన్నికైతే ఇంకెలా మాట్లాడుతారో అని ప్రజలు విమర్శిస్తున్నారు.

జింకలు తరలించారంటూ గగ్గోలు

హవేళిఘణాపూర్ మండలం పోచారం అభయారణ్యంలో 120 ఎకరాల్లో జింకల ప్రత్యుత్పత్తి కేంద్రం విస్తరించి ఉంది. ఇందులో జింకల సంఖ్య ఒక పరిమితి వరకు మాత్రమే ఉంచుతారు. ఆ పరిమితి దాటితే వాటిని ఇక్కడి నుంచి వివిధ అటవీ ప్రాంతాలకు తరలిస్తారు. ఒకవేళ తరలించకుంటే వాటి సంఖ్య పెరిగి ఆహారం దొరక్క చనిపోతాయి. ఇటీవల ఈ ప్రత్యుత్పత్తి కేంద్రం నుంచి కొన్ని సిద్దిపేట జిల్లాలోని ఆక్సిజన్ పార్కుకు తరలించినట్లు తెల్సింది. దీనిపై రోహిత్‌రావు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు జింకలను సైతం వదలకుండా ఇక్కడి నుంచి తరలించాడంటూ వ్యాఖ్యలు చేశాడు. పార్కులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడడం ఏంటని, ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంపై ఎలా పట్టు సాధిస్తాడని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు.

అదనపు బలగాలు మోహరించండి

- గట్టి బందోబస్తు ఏర్పాటు చేయండి
- ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి
- ఫోన్లు కేంద్రంలోకి అనుమతి లేదు
- రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్ వి.నాయక్, దీపక్ మిశ్రా



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్, దీపక్ మిశ్రా

మెదక్ కలెక్టరేట్: పోలింగ్ వద్ద క్షేత్రస్థాయిలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో బలగాలను మోహరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్ వి.నాయక్, పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా సూచించారు. శుక్రవారం ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ అజయ్ వి.నాయక్, రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వారికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై సాధారణ పరిశీలకులు పృథ్వీరాజ్, పోలీస్ పరిశీలకులు సంతోష్ కుమార్‌తో మాట్లాడి తెలుసుకున్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

కలెక్టర్ రాజర్షిషా రాష్ట్ర పరిశీలకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలోనూ పరిస్థితులన్నీ సజావుగానే ఉన్నట్లు వివరించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని స్టేట్ అబ్జర్వర్‌లు ఎస్పీకి సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎలక్షన్ కమిషన్ పాసులు ఉన్న వారినే అనుమతించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. పోలింగ్ స్టేషన్ల సమీపంలో ఓటర్లను అభ్యర్థులు, వారి ఏజెంట్లు కలిసి ఓటర్లను ఒత్తిడి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



కాడిపల్లి : వెల్మకన్నలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి జరిగిందని,, తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా రెడ్డి తెలిపారు. శుక్రవారం కొడిపల్లి మండలం లింగంపల్లి, బిట్లతండా, కొట్టాల, వెల్మకన్న, దేవులపల్లి, మహ్మద్‌నగర్, కూకుట్లపల్లి, భుజిరంపేట, పీర్యతండా తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పరంపోగు భూములన్నింటిని పట్టా భూములుగా మారుస్తామని చెప్పారు. ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్‌తో రైతులను ఆదుకుంటున్నామని చెప్పారు. గడపగడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

బిట్లతండాకు సీఎం కేసీఆర్‌ను తీసుకువస్తా..

బిట్లతండాలో 36 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని, తండావాసులు కోరితే తండాకు సీఎం కేసీఆర్‌ను తీసుకువస్తానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. అన్ని తండాలను సీసీ రోడ్డు వేశామన్నారు. బీటీ రోడ్లకు సైతం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సునీతారెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. లింగంపల్లితోపాటు పలు గ్రామాలు, తండాలు కొత్తపంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలోని కొట్టాలలో ప్రవీన్‌గౌడ్‌తోపాటు బిట్లతండా, మహ్మద్‌నగర్ గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీలో చేరిన యువకులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.

–ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

పనిచేసేవారిని కాంగ్రెస్ మోసం చేస్తుంది..

కష్టపడి పనిచేసేవారిని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని గాలి అనిల్‌కుమార్ విమర్శించారు. వెల్మకన్నలో సునీతారెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్‌పార్టీ మోసాన్ని భరించలేక సొంత పార్టీలోకి వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రపుర్ కార్పొరేటర్ పుష్ప, ఎంపీపీ రాజు, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, జెడ్పీటీసీ కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్లం, నర్సింగారావ్, దివ్య, సుజాత, వనజ, ప్రమీళ, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, కిషోర్‌గౌడ్, దూద్యనాయక్, వీరయ్య, రాజు, శివరాజ్, కిరణ్‌గుప్తా, సంతోష్‌గౌడ్, లింగం, రాజు, కాంతారావ్, పాల్గొన్నారు.

–గాలి అనిల్‌కుమార్

బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం

వెల్దుర్తి(తూప్రాన్): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఆదరించి మరోసారి పట్టం కట్టాలని సునితారెడ్డి కోరారు. వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్ తండాలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, నాయకులు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, పెంట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సునీతారెడ్డి విజయం ఖాయం

హత్నూర(సంగారెడ్డి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి విజయం ఖాయమని ఎంపీపీ అధ్యక్షులు వావిలాల నర్సింలు అన్నారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్ లో ఎంపీపీ నర్సింలు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, కిషోర్, అజమత్ అలీ, కొన్యాల సతీష్ ,సాజిద్ ,శేఖర్ గౌడ్ ,సాయికుమార్, వెంకటేష్ గౌడ్, కిషన్ గౌడ్, గౌస్, అజీస్ పాల్గొన్నారు.



కాడిపల్లి : కొట్టాలలో ఎన్నికల ప్రచారంలో భారీ ర్యాలీ



వెల్దుర్తి-ప్రచారం నిర్వహిస్తున్న సునితారెడ్డి



దౌల్తాబాద్ లో సునీతా రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ నర్సింలు

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం



తాటిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

ఆ పార్టీ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం పోతులబోగుడాలోని తన నివాసంలో అల్లాదుర్గ్ మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలతో పాటు శివాజీ యూత్ సభ్యులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, రామాగౌడ్, పెంటయ్య, వెంకట్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో సుపరిపాలన

టేక్మాల్(మెదక్): బీఆర్ఎస్‌తోనే సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ గెలుపు కోసం ఆయన మండలంలోని వెల్పుగొండలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగంలో ఉంచిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. క్రాంతికిరణ్ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరప్ప, చింత రవి, నారాయణ, పొలు, రమేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న చంటి పద్మావతి

క్షేత్రస్థాయిలో పథకాల అమలు

మునిపల్లి(అందోల్): సీఎం కేసీఆర్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి, పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, మేళసంగ్యం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు తాటిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పిల్లోడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎక్కువ చేస్తే తోకలు కత్తిరిస్తానని క్రాంతి కిరణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి, సాయికుమార్, విజయ్ కుమార్, శశికుమార్, నవాజ్‌రెడ్డి, బక్కారెడ్డి పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

రేగోడ్(మెదక్): అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను మరోసారి గెలిపించి ఆశీర్వదించాలని ఆయన సతీమణి పద్మావతి కోరారు. చౌదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సంద్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోయి గోస పడొద్దని ప్రజలను కోరారు.

క్లుప్తంగా

పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోమన్ టెన్జింగ్ భూటియా అన్నారు. శుక్రవారం సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సీఐ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిన్నకోడూరులో పోలింగ్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మైలారం, అల్లీపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల అబ్జర్వర్ జయశ్రీ బోజ్ పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉద్రిక్తత చోటు చేసుకున్న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు, తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్ఐ సుభాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం తెలిపారు. శనివారం పట్టణంలోని రవీంద్ర హైస్కూల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రిటర్నింగ్ అధికారి వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చేగుంట నుంచి మెదక్‌కు వెళ్తున్న దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ జయచంద్రారెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ టీం లీడర్ తిరుమలేష్‌కు ఆయన పలు సూచనలు చేశారు.

పెద్దాయనకు.. పాదాభివందనం



మండల పరిధిలోని విఠలాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని వేడుకున్నారు. ఓ పెద్దాయన పాదాలకు నమస్కరించి ఓటు వేయాలని అభ్యర్థించారు.

–చిన్నకోడూరు(సిద్దిపేట)



అక్కా .. కారును యాదుంచుకో..

అక్కా... మనమంతా కలిసి కారు గుర్తుకు ఓటేద్దామని.. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి ఓటు వృథా చేసుకోవద్దని స్థానిక హరీశ్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండం కవిత సంపత్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీశన్నను అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

–సిద్దిపేటజోన్



ఎన్నికల 'గారె'ఢీ

పట్టణంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి గారెలు వేపుతూ.. పండ్లు అమ్ముతూ ఓటు వేయాలని అభ్యర్థించారు.

– హుస్నాబాద్

అవినీతి సర్కార్‌ను సాగనంపాలి



శిలాజీనగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: ఏ లక్ష్యం కోసం తెలంగాణను తెచ్చుకున్నామో.. ఆ ఫలాలను ప్రజలకు దక్కనీయకుండా దుర్మార్గమైన పాలన చేస్తున్న కేసీఆర్ సర్కార్‌ను సాగనంపుదామని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్ప.. ఎవరూ బాగుపడలేదని విమర్శించారు. శుక్రవారం పట్టణంలో రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కేసీఆర్ పాలనలో కొత్తగా ఎంతమందికి నౌకర్లు, కొత్త రేషన్ కార్డులు వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ కోసం అమరులైన కుటుంబాలు శోకంతో కుమిలిపోతుంటే..కేసీఆర్ కుటుంబం మాత్రం అందినంత దోచుకుందన్నారు.

హరీశ్ ఎంత తిరిగితే అంత మంచిది..

హరీశ్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో ఎంత తిరిగితే మాకు అంత మంచిదని రఘునందన్‌రావు అన్నారు.హరీశ్ దుబ్బాకలో చెల్లని రూపాయి అని, గత ఉపఎన్నికల్లోనే అది రుజువైందన్నారు. దుబ్బాక ప్రజల చైతన్యం ముందు హరీశ్ డ్రామాలు, కల్లబొల్లి మాటలు, పిట్ట కథలు నడవవన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తా..

ప్రజల ఆశీర్వాదంతో దుబ్బాకలో భారీ మెజార్టీతో గెలుపొందుతానని రఘునందన్‌రావు అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తండోపతండాలుగా స్వచ్ఛందంగా తరలివస్తూ ఘనస్వాగతం పలుకుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు.

ఒక్క రేషన్ కార్డు రాకపాయే..

దౌల్తాబాద్(దుబ్బాక): పదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో ఒక్క నిరుపేద కుటుంబానికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని రఘునందన్‌రావు విమర్శించారు. శుక్రవారం కోనాపూర్, మహ్మద్‌షాపూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రభుత్వం నిధులు విడుదల చేయక కోనాపూర్‌లో డబుల్ బెడ్ రూంలు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం పైసల్ ఇవ్వకా ఉరి వేసుకొని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కిషన్, పంచామి స్వామి, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, కుమ్మరి నర్సింహులు, అనిల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



గంభీర్‌పూర్‌లో రఘునందన్‌రావు ప్రచారంకు భారీగా తరలివచ్చిన జనం

రుణ మాఫీ చేయడంలో విఫలం

దుబ్బాకరూరల్: గంభీర్‌పూర్, శిలాజినగర్, వెంకటగిరితండాల్లో రఘునందన్‌రావు ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం కేసీఆర్ దళిత బంధు, బీసీ బంధు పేరుతో చిచ్చుపెడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీకి మద్దతుగా..

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన దళితులు బీజేపీకి మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు. గ్రామ నాయకుడు బాల సాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఇటీవల ప్రధాని ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినందున తామంతా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపునకు పని చేస్తామని పేర్కొన్నారు.

సీఎం మాటలను ప్రజలు నమ్మరు

కాంగ్రెస్ నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలను నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు నమ్మరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరందిస్తానని, 2018లో నర్సాపూర్‌ను దత్తత తీసుకుని బంగారు తునక చేస్తానని సీఎం హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని, ప్రస్తుతం ఇచ్చేవాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన చెప్పారు. ధరణి.. పేద రైతుల పాలిట శాపంగా మారిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి భూమాత పోర్టల్ ద్వారా న్యాయం చేస్తామని చెప్పారు. ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ఇచ్చిన హామీలన్నీ గతంలో మాదిరిగానే తుంగలో తొక్కుతారని ఎద్దేవా చేశారు. దేవులపల్లి, వెల్మకన్నె, ముండ్రాయి, శివ్వంపేట తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములను ధరణిలో పార్ట్ బీలో పెట్టి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని, అనంతరం వాటి రికార్డులు సరి చేయించుకుని అధిక ధరలకు అమ్ముతూ కోటీశ్వరులయ్యారని విచారం వ్యక్తం చేశారు. కాగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి స్వగ్రామమైన గోమారంను మండల కేంద్రం చేయాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. సమావేశంలో చిలిపిచెడ్ మాజీ జెడ్పీటీసీ చిలుముల శేషాసాయిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్, నాయకులు ఆంజనేయులుగౌడ్, రిజ్వాన్, మల్లేష్, శ్రీనివాస్‌గుప్తా, రవీందర్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, రాజాగౌడ్, మల్లేష్‌గౌడ్, అశోక్, రామాగౌడ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ప్రచారం

ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా నర్సాపూర్‌లోని రెండో వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో చిన్న అంజిగౌడ్, సుధీర్‌గౌడ్, రషీద్ పాల్గొన్నారు.

అప్పుల్లో తెలంగాణ..



ధాన్యం నూర్పుడి పడుతూ..



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఇతర నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్, తిరుమలాపూర్, బ్రాహ్మణపల్లి ఆయా పంచాయతీల పరిధిలోని గిరిజన తండాల్లో ఆవుల రాజిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ నాయకులు అప్పుల పాలుచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ తీసుకువచ్చిన 6 గ్యారంటీ పథకాలను గుర్తించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ గుప్తా, రవీందర్ రెడ్డి, మల్లేష్, అశోక్, ఆకుల నర్సింలు, సుధీర్ గౌడ్, నందు, అశోక్ గౌడ్, ఉదయ్ పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని విఠల్ తండా సమీపంలో ధాన్యం నూర్పిడి పడుతూ ఓటు వేయాలని రాజిరెడ్డి కోరారు.

ఆరు గ్యారంటీలు అమలు

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సంక్షేమం కోసం 6 గ్యారంటీలు అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి భార్య శైలజారెడ్డి, సుహాసినిరెడ్డి, కమల, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తాలు అన్నారు. శుక్రవారం దంతన్‌పల్లి, రత్నపూర్ తండాతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సంఘటితంగా కృషిచేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి గెలుపుకోసం కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పులింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్‌రెడ్డి, సంజీవరెడ్డి, కిషన్, సత్యనారాయణ, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిలప్‌చెడ్(నర్సాపూర్)): ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, సర్వర్‌మీర్జా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, భూమయ్య, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం రేండ్లగూడ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆవుల కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హకీం పాల్గొన్నారు.



దంతన్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శైలాజరెడ్డి



తుజాల్‌పూర్‌లో ప్రచారం